సాక్షి
ఏలూరు

ఆదివారం । 12 । మే । 2024

మన అభ్యర్థులను గెలిపించండి
వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌లను పరిచయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి





మీ అభిమానం మరువలేను
అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

కదం తొక్కిన కైకలూరు: కైకలూరు తాలూకా సెంటర్‌లో సీఎం జగన్ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

కైకలూరు..

కదనోత్సాహం

జయహో జగన్

- అడుగడుగునా నీరాజనం
- మండుటెండను లెక్కచేయని వైనం
- సీఎం జగన్ సభకు పోటెత్తిన ప్రజలు
- కైకలూరులో సభ సూపర్ సక్సెస్

కొల్లేరు కెరటం ఉప్పొంగినట్టు.. బిందువు బిందువు చేరి సింధువైనట్టు.. జగన్ సైన్యం తరంగంలా కదలిరాగా కైకలూరు జన సునామీని తలపించింది. తమ అభిమాన నేతను చూసేందుకు నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.. మండుటెండను సైతం లెక్కచేయకుండా జననేత రాక కోసం ఎదురుచూశారు. అడుగడుగునా మహిళలు నీరాజనాలు పట్టగా.. అంతటా జగన్నినాదం మార్మోగింది. కైకలూరులోని తాలూకా సెంటర్‌లో శనివారం సీఎం జగన్ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. – కైకలూరు



అడిగడిగో జగన్ మావయ్య..
చిన్నారి ఆనందోత్సాహం



మేమంతా మీ వెంటే..
జేజేలు పలుకుతున్న అభిమానులు



మా నమ్మకం నువ్వే జగన్..
యువత కేరింతలు

కైకలూరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరులో సీఎం జగన్ నిర్వహించిన బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఉదయం 10 గంటల నుంచే నియోజకవర్గ నాలుగు మండలాల నుంచి అభిమానులు తరలివచ్చారు. తీన్‌మార్ డప్పులు, కేరళ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, తప్పటిగుళ్ల వంటి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎండ తీవ్రత దృష్ట్యా మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లను నాయకులు అందుబాటులో ఉంచారు. చంటి బిడ్డలతో సైతం మహిళలు హాజరయ్యారు. జగన్ పాటలకు మహిళలు నృత్యాలు చేశారు. కైకలూరులోని తాలూకా సెంటర్ వేలాది మంది అభిమానులతో నిండిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా అశేషంగా తరలివచ్చారు. తాలూకా సెంటర్ నుంచి గాంధీ బొమ్మ వరకు జనాలు కిటకిటలాడారు.

మధ్యాహ్నం 1.43 గంటలకు..

కైకలూరులోని భాష్యం స్కూల్ సమీప గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి మధ్యాహ్నం 1.43 గంటల సమయంలో సీఎం జగన్ సభాస్థలికి బయలుదేరారు. మధ్యాహ్నం 2.11 గంటలకు తాలూకా సెంటర్‌లో సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించారు. కైకలూరు సిద్ధమా అని అనగానే ప్రజలు ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. చంద్రబాబును నమ్మారో కొండ చిలువ నోట్లో తలపెట్టినట్లే అని చెప్పగానే జనాలు చప్పట్లు కొట్టారు. తెలుగుదేశం మేనిఫెస్టోను చూపిస్తూ మళ్లీ కూటమితో వస్తున్న వీరిని నమ్ముతారా అని అనగా.. నమ్మం నమ్మం అంటూ ప్రజలంతా చేతులు ఊపారు. అక్కచెల్లెమ్మల కోసం ఇన్ని పథకాలు పెట్టిన ప్రభుత్వం ఎప్పుడైనా ఉందా.. అక్కా జరిగిందా.. చెల్లెమ్మా ఎప్పుడైనా జరిగిందా.. అని ప్రశ్నించినప్పుడు మహిళల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరుతూ సీఎం జగన్ మధ్యాహ్నం 2.43 గంటలకు ప్రచారాన్ని ముగించారు. మధ్యాహ్నం 3.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో పిఠాపురం వెళ్లారు. బహిరంగ సభలో ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు.

సునీల్, డీఎన్నార్‌లను గెలిపించండి

మంచివాడు.. సౌమ్యుడు డీఎన్నార్ అన్న ద్వారా మీకు మంచి జరుగుతుందని మనసారా తెలియచేస్తున్నాను. అన్నపై మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు సంపూర్ణంగా ఉంచాలని ప్రార్థిస్తున్నాను. అలాగే సునీల్ బీసీ కులానికి చెందిన వ్యక్తి. యువకుడు, ఉత్సాహవంతుడు, ఎంపీగా నిలబడ్డాడు. నా తమ్ముడైన సునీల్‌కు మీ చల్లని దీవెనలు ఉంటాయని ప్రార్థిస్తున్నాను అని సీఎం జగన్ అన్నారు.

పేదల కష్టం తెలుసు.. ప్రజల మధ్యనే ఉంటా..



ఏసీ రూముల్లో కూర్చుని రాజకీయాలు చేసే వ్యక్తిని నేను కాదు. పేదల కష్టం తెలిసిన వ్యక్తిని. ప్రజల మధ్యనే ఉంటాను. పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకుని చంద్రబాబు దండుకున్నారని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు కూటమిలో భాగస్వామ్యమయ్యారు. మన జిల్లాలో ఎక్కడా బీసీ అభ్యర్థి లేరన్నట్టు కడప నుంచి ఎంపీ అభ్యర్థిని తీసుకొచ్చారు. కొల్లేరు వలస పక్షులు వచ్చి పోయినట్టు సూటు కేసుల డబ్బుతో వచ్చిన కూటమి నేతలు అలానే తిరిగి వెళతారు. కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్, నేనూ లోకల్. నేను ఢిల్లీలో, ఎమ్మెల్యే రాష్ట్రంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం కష్టపడతాం. నిత్యం మీ వెంటే ఉంటాం. మీ సంక్షేమం కోసం 130 సార్లు బటన్ నొక్కిన సీఎం జగన్ కోసం, మా కోసం ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లూ నొక్కండి. 13న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లు వేసి మాకు విజయాన్ని చేకూర్చండి.

– కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎంపీ అభ్యర్థి, ఏలూరు

రెడ్‌బుక్ మడిచి పంచెలో పెట్టుకో..



కూటమి అభ్యర్థి రెడ్‌బుక్ పేరు చెప్పి భయపెడుతున్నాడు. అతను దానిని మడిచి పంచెలో పెట్టుకోవాలి. నాపై, నా కొడుకులపై కొల్లేరు చెరువులు, మట్టి దందా అని ఆరోపణలు చేస్తున్నావు. నీకు అసలు బుద్ధుందా ? మనిషి జన్మ ఎత్తావా ? అమెరికా, హైదరాబాద్ నుంచి డబ్బు సంచులు, సినీ హీరోలు, జబర్దస్త్ నటులను తీసుకొచ్చినా ఎవరూ కామినేనికి ఓట్లు వేయరు. నా హయాంలో నియోజకవర్గంలో 12 వేల ఇళ్లు ఇచ్చాం. విద్యుత్ సబ్‌స్టేషన్లు, దుంపలకోడు, సున్నంపూడి, పోతుమర్రులకు నీరు, కొల్లేటి పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం, పాలిటెక్నిక్ కాలేజీ, అనివేటి మండపం, కైకలూరులో రుద్రభూమి ఇలా అన్నీ కట్టించాం. కామినేనీ నువ్వు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు చేయని డయాలసిస్ సెంటర్‌ను మేం ఏర్పాటు చేశాం. కామినేని మెడిటెక్ వంటి కుంభకోణాల్లో సంపాదించిన డబ్బును తీసుకుని ఓటర్లు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి. – దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్యే



సంక్షేమ సారథికి జేజేలు.. బహిరంగ సభా ప్రాంగణంలో జయహో జగన్ అంటూ..



అభిమానం మెండుగా.. చెట్టుపై నుంచి చూస్తూ..

కొల్లేరు మిగులు భూములు పంపిణీ చేస్తాం

కొల్లేరు మిగులు భూముల పంపిణీ జరగాలంటే మళ్లీ తానే ముఖ్యమంత్రిగా రావాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చెప్పిన మాట ప్రకారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించామని, అలాగే కొల్లేరు ప్రాంతంలో భూముల సర్వేను పూర్తి చేశామన్నారు. సర్వే రిపోర్టు రాగానే మిగులు భూములను ఇక్కడ ప్రజలకు పంపిణీ చేస్తామని, ఈ పంపిణీ కార్యక్రమానికి తానే స్వయంగా వస్తానని సీఎం జగన్ చెప్పారు. దీంతో కొల్లేరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



అవ్వ ఆశీస్సులు.. మనవడా నీకే మా ఓటు



ఉప్పొంగిన ఉత్సాహం.. చేతులు ఊపుతూ..



స్తంభం ఎక్కిన అభిమానం.. సీఎం జగన్‌ను చూసేందుకు

రంగవల్లులతో ఓటరు చైతన్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్నికల ప్రాముఖ్యతపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్, ఎస్పీ రామన్, పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వీటిని తిలకించారు. సెల్ఫీ స్టాండ్, మోడల్ ఈవీఎం, ఫొటో గ్యాలరీని వారు పరిశీలించారు. సెయింట్ థెరిస్సా కళాశాల సమావేశ మందిరంలో ఓటేద్దాం.. రండి కదిలి రండి... పేరిట ఏర్పాటు చేసిన దీపాలంకరణ ఆకట్టుకుంది. అనంతరం ఓటు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

13న స్థానిక సెలవు

ఏలూరు(మెట్రో): ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గంలోని అన్ని కార్యాలయాలకు సెలవును ప్రకటిస్తూ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు.



రంగవల్లులను పరిశీలిస్తున్న కలెక్టర్, పరిశీలకులు

జిల్లా ఖజానా, ఉప ఖజానా కార్యాలయం, అత్యవసర సేవల విభాగాలను మినహాయించినట్టు పేర్కొన్నారు.

వేతనంతో కూడిన సెలవు : పోలింగ్ రోజున జిల్లాలో దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్టు ఏలూరు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. దుకాణాలు, సంస్థల యజమానులు ఓటు హక్కు కలిగిన వారి ఉద్యోగులు, సిబ్బందికి సెలవు మంజూరు చేయాలని, ఎటువంటి వేతన తగ్గింపు చేయరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రచారానికి తెర

- మూగబోయిన మైకులు
- పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఏలూరు (మెట్రో): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టిన ప్రచారపర్వం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. జిల్లావ్యాప్తంగా ప్రచారాలు నువ్వానేనా అన్నట్టు సాగాయి. గతనెల 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీ కాగా 25 వరకు నామినేషన్ల ప్రక్రియను కొనసాగింది. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఘట్టాలు ముగిశాయి.

వైఎస్సార్‌సీపీ ఫుల్ జోష్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు, కైకలూరు, నరసాపురం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. భారీ స్థాయిలో ప్రజలు తమ అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చారు. అలాగే ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, ఉండి, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో సీఎం జగన్ బస్సు యాత్ర నిర్వహించారు. రోడ్‌షోగా



ఉంగుటూరులో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీకి సిద్ధమైన ఏర్పాట్లు

సాగిన యాత్రలో ప్రజలు నీరాజనాలు పలికారు. అలాగే భీమవరంలో నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి మద్దతు తెలిపారు.

పోలింగ్‌కు సిద్ధం : జిల్లాలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసి జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది. ఆదివారం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, పోలింగ్ సామగ్రిని తరలించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లాకు పాఠ్య పుస్తకాలొస్తున్నాయ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాకు సంబంధించి 2024–25 విద్యా సంవత్సరానికి గాను పాఠ్య పుస్తకాలు వస్తున్నాయని సమగ్రశిక్ష అదనపు పథక సంచాలకుడు బి.సోమశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడకు 8,9,10 తరగతులకు సంబంధించిన 65,822 పుస్తకాలు, పెదపాడు స్టాక్ పాయింట్‌కు 9వ తరగతికి సంబంధించి 7,865 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. పాఠ్య పుస్తకాలన్నీ పూర్తిస్థాయిలో వచ్చిన అనంతరం పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు పంపిణీకి ఏర్పాట్లు చేస్తామన్నారు. తరువాత పెదపాడులో స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు.

భద్రపర్చాల్సిన బాధ్యత అధికారులదే..

భీమడోలు: మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలను స్టాక్ పాయింట్లలో భద్రపర్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని డీఈఓ ఎస్.అబ్రహం అన్నారు. భీమడోలు జెడ్పీ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్‌కు చేరుకున్న పాఠ్య పుస్తకాలను శనివారం ఆయన పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎక్కడా కొరత లేకుండా ఇండెంట్ ప్రకారం పుస్తకాలు వచ్చిందీ లేనిదీ పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఎంఈఓలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, సీఆర్‌ఎంటీలు సత్యప్రసాద్, రాధాకృష్ణ, రమణ ఉన్నారు.



భీమడోలు స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

బీజేపీది డబుల్ ఫెయిల్యూర్ సర్కార్

భీమవరం: కేంద్రంలోని బీజేపీది డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, డబుల్ ఫెయిల్యూర్ సర్కారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఎద్దేవా చేశారు. ఏపీకి అన్యాయం చేస్తున్న బీజేపీ పంచన టీడీపీ, జనసేన చేరడం సిగ్గుచేటని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భీమవరంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, వ్యవస్థలను నాశనం చేస్తున్నారని పవన్ మాట్లాడుతున్నారని వాటి గురించి ఆయనకేం తెలుసని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తున్నా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేయలేకపోయినా, రైల్వే జోన్ ఇవ్వకపోయినా ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కేబీఆర్ నాయుడు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

ఫ్యాన్ జోరు.. ప్రచార హోరు

- ముగిసిన ప్రచార పర్వం
- నియోజకవర్గాల్లో హోరెత్తిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల, నేతల ప్రచారం
- మోటార్ సైకిళ్ల ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలతో ప్రజలతో మమేకం



బుట్టాయగూడెం : పెదకాపవరంలో ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి

సార్వత్రిక ఎన్నికలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. కొద్దిరోజులుగా ముమ్మరంగా సాగిన ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. చివరి రోజు శనివారం అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. పలుచోట్ల భారీ ర్యాలీలు నిర్వహించారు. అభ్యర్థులకు మద్దతుగా వారి మద్దతుదారులు ఇంటింటా ప్రచారాలు చేశారు. ప్రత్యర్థులతో పోలిస్తే వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలతో ఐదేళ్లుగా ప్రజల మధ్యనే ఉండటం ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు బాగా కలిసొచ్చింది. స్థానికుల నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అపూర్వ స్పందన లభించింది. – సాక్షి నెట్‌వర్క్



దెందులూరు : కేదవరంలో ప్రచారం చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్



నిడమర్రు : బువ్వనపల్లిలో ఇంటింటా ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న ఉంగుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు



నూజివీడు : నూజివీడు ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఏలూరు (ఆర్‌ఆర్ పేట): ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని విజయాన్ని కాంక్షిస్తూ ఏలూరు 23వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



జంగారెడ్డిగూడెం : చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజుకు మద్దతుగా జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కైకలూరు : కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు గెలుపు కోరుతూ కైకలూరులో ప్రచారం చేస్తున్న డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

పోలింగ్ సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది కోసం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఆదివారం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల మధ్య బస్సులు సిబ్బందిని గమ్యస్థానాలకు చేరుస్తాయన్నారు. ఏలూరు బస్టాండ్ నుంచి చింతలపూడి, కైకలూరు, నూజివీడు, ఉంగుటూరు, పెదవేగి, రంగాపురంలకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే పెదపాడు బస్‌స్టేషన్ నుంచి ఏలూరు, చింతలపూడికి, జంగారెడ్డిగూడెం బస్‌స్టేషన్ నుంచి చింతలపూడి, ఏలూరు, పోలవరం, నూజివీడులకు, నూజివీడు బస్‌స్టేషన్ నుంచి చింతలపూడి, కైకలూరు, ఉంగుటూరు, ముసునూరుకు బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. చాట్రాయి బస్‌స్టేషన్ నుంచి నూజివీడు, ఏలూరుకు, ఆగిరిపల్లి బస్‌స్టేషన్ నుంచి నూజివీడు, ఏలూరుకు, ధర్మాజీగూడెం బస్‌స్టేషన్ నుంచి చింతలపూడికి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇవి కాక రెగ్యులర్‌గా వివిధ బస్‌స్టేషన్ల నుంచి బయలుదేరే బస్సులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఏలూరు బస్‌స్టేషన్ నుంచి జంగారెడ్డిగూడెం, పోలవరానికి, జంగారెడ్డిగూడెం బస్‌స్టేషన్ నుంచి నూజివీడుకు, నూజివీడు నుంచి జంగారెడ్డిగూడెంకు, బుట్టాయిగూడెం నుంచి జంగారెడ్డిగూడెంకు, కలిదిండి నుంచి కైకలూరు, ఏలూరుకు, ముదినేపల్లి నుంచి మండవల్లి, కైకలూరు, ఏలూరుకు, పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరుకు, ద్వారకాతిరుమల నుంచి దెందులూరు, ఏలూరుకు, చింతలపూడి నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడుకు బస్సులు అందుబాటులో ఉంచామని వివరించారు. పోలింగ్ సిబ్బంది ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ఏలూరు (మెట్రో): ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలో ఓటరు గుర్తింపు కార్డుతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి గుర్తుగా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన గుర్తింపు కార్డుల్లో ఆధార్ కార్డు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డ్, బ్యాంకు లేదా పోస్టాఫీసులు ఫొటోతో సహా జారీచేసిన పాస్ బుక్, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఆర్టీఐ ఎన్‌పీఆర్ కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుబంధ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు వారి ఉద్యోగాలకు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు, కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ జారీ చేసిన యూనిక్ దివ్యాంగ కార్డుల్లో ఏదోకటి గుర్తింపు చూపి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నీ ప్రారంభం

భీమవరం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీలు అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం కార్యదర్శి మెంటే పార్థసారథి ప్రారంభించి మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల మేధాశక్తిని పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలు జాతీయ స్థాయిలో భీమవరానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని పార్థసారథి కోరారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో గెలుపొందిన 20 మంది విజేతలు జూన్ 4వ తేదీ నుంచి ఐదు రోజులపాటు భీమవరంలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఓపెన్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలకు ఎంపికవుతారన్నారు.

టీడీపీ, జనసేనకు ఝలక్



ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు



కొండలరావుపాలెంలో దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు

ఏలూరు టౌన్: ఎన్నికల సంగ్రామంలో చివరి దశకు చేరుకుంటున్న తరుణంలో ఏలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో చేరికల జోరు కొనసాగింది. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో భారీగా టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పిల్లా దేవేంద్ర నాయుడు, పేరాబత్తుల జయదీప్‌నాయుడు, పల్లంట్ల బాలు నాయుడు ఆధ్వర్యంలో సుమారుగా 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు, యువత పార్టీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ దౌర్జన్యాలు, అక్రమాలు, భూకబ్జాలు, అరాచకాలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు సుపరిపాలన చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమంతోపాటు, మహిళలు, యువత, రైతులు, విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. పార్టీలో చేరిన వారంత వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

అబ్బయ్యచౌదరి సమక్షంలో..

పెదవేగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 100 మంది యువకులు శనివారం రాత్రి కొండలరావుపాలెంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. యువత ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించారు.

జగన్ నీడలో.. జనం చల్లగా

ప్రభుత్వ పథకాల కోసం ఎవ్వరి కాళ్లు మొక్కాల్సిన పనిలేదు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అగత్యం అంతకన్నా లేదు. కులం చూడలేదు.. మతం పట్టించుకోలేదు.. వేరే పార్టీలు అని పక్కన పెట్టలేదు. అర్హత ఉంటే చాలు ఇంటింటికీ సంక్షేమ నవరత్నాలు అందించాడు. ఎవ్వరికీ లంచాలు కూడా ఇవ్వాల్సిన అవసరం లేకుండా నేరుగా మా బ్యాంక్ ఖాతాలకే సంక్షేమ లబ్ధి అందజేశాడు. ఇంతకంటే ఇంకేం కావాలి. జగన్ నీడలో జనం చల్లగా బతుకుతున్నారయ్యా.. అంటున్నారు కైకలూరు సీఎం సభకు వచ్చిన ప్రజలు. జగన్ పాలనలో హాయిగా ఉన్నాం.. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం అని చెబుతున్నారు.

– కైకలూరు/కలిదిండి/మండవల్లి/ముదినేపల్లి





ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్లు చేయించుకుని ఆరోగ్యంగా ఉన్న రేవాడ శ్రీనివాస్, నాగమణి దంపతులు

మా ఊపిరి జగన్

చావు అంచుల వరకు వెళ్లిన ఎందరో పేదలకు ఊపిరి పోసింది వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం. అనారోగ్యంతో బాధపడుతూ.. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉండడంతో సతమతమవుతున్న ఎన్నో పేద కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించి ప్రాణాలు నిలబెట్టారు దివంగత నేత వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. వారి చలవతోనే తాము బతికి బట్ట కట్టామని చెబుతున్నారు భీమడోలు అరుంధతీకాలనీకి చెందిన రేవాడ శ్రీనివాస్, నాగమణి దంపతులు. ఆనాడు వారు అనుభవించిన కష్టాలు శ్రీనివాస్ మాటల్లోనే...

– భీమడోలు

మాది నిరుపేద కుటుంబం. పాత సామగ్రి కొనుగోలు చేస్తూ ముగ్గు అమ్ముకుని జీవిస్తుంటాం. మాకు ఇద్దరు కుమార్తెలు రమణ, రమాదేవి. వెన్నుపూస దెబ్బతినడంతో నా భార్య నాగమణి మంచానికి పరిమితమైంది. వైద్యం కోసం లక్షలు ఖర్చవుతుందన్నారు. కడుబీదరికంలో ఉన్న మాకు ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ పథకం మమ్మల్ని ఆదుకుంది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.4 లక్షలతో వెన్నుపూస ఆపరేషన్ చేయించగలిగాం. దాంతో తన ఆరోగ్యం కుదుటపడింది. 2019లో నాకు గుండెలోని నాలుగు వాల్వ్‌లు మూసుకుపోయాయి. చావు అంచుల్లోకి వెళ్లాను. మనసున్న మారాజు మా జగనన్న పాలనలో రూ.5 లక్షలతో ఆధునిక వైద్యం చేయించుకోగలిగాను. మా దంపతులు ఇద్దరం బతికిబట్టకటామంటే ఆరోగ్యశ్రీ పథకం. ఇవికాక జగనన్న ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల పథకాలతో మేం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కాం. దీనితో మా కుటుంబాలు ఆర్థికంగా నిలబడ్డాయి. మాకు ప్రాణభిక్ష పెట్టిన వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మేం జీవించి ఉన్నంతకాలం మరవలేం. వారి స్ఫూర్తితో ఏటా వేసవిలో రాష్ట్రీయ రహదారి పాత ఆసుపత్రి వద్ద మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వందలాది మంది దాహార్తి తీర్చుతున్నాను.

సక్రమంగా సంక్షేమ పథకాలు



మాకు సకాలంలో సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలనలో ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే డీఎన్నార్ సైతం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మా బాగోగులు చూసుకుంటున్నారు. ఇలా ఏ ప్రభుత్వంలోనూ మాకు మేలు జరగలేదు. ఎవరైనా మంచి చేసే వారి వెనుకే నడుస్తారు. మేము కూడా జగన్ వెంటనే నడుస్తాము.

– ఎం బుజ్జిబాబు, తాడినాడ, కలిదిండి మండలం

మహిళా సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



మహిళల సంక్షేమానికి అహర్నిశలు శ్రమించి, మమ్మల్ని ఆర్థికంగా అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే మద్దతుగా నిలబడతాం. ఎక్కడికీ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన నాయకుడికే అండగా ఉంటాం. మహిళా సంక్షేమం జగన్‌తోనే సాధ్యం అవుతుందని మా నమ్మకం. అందుకని జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలి.

– కె. సంపూర్ణమ్మ, గొల్లగూడెం, కలిదిండి మండలం

మాకు సీఎంగా జగనే కావాలి



ఎల్లప్పుడూ న్యాయం మాత్రమే గెలుస్తుంది. నిజాయితీగా ఉండే జగనన్న మాత్రమే గెలుస్తారు. మాకు ఇళ్ల స్థలం ఇచ్చి కట్టుకోవడానికి రూ.1.80 లక్షలు సాయం చేశారు. ఇప్పుడు జగనన్న పుణ్యమా అంటూ మాకు ఒక గూడు ఏర్పడింది. అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ వంటి సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందింది. మా ఇంటాయనకు ఒకటో తేదీ పొద్దున్నే వలంటీర్ వచ్చి రూ.3 వేలు పింఛన్ ఇస్తుంది. గత రెండు నెలలుగా ఆ డబ్బులను తీసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. మాకు సీఎంగా జగనే కావాలి.

– వై.లత, కోరుకొల్లు, కలిదిండి మండలం

పేదల పాలిట పెన్నిధి



పేదల జీవితాలు మారాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. మేము ఇప్పుడు ఒక స్థాయిలో ఉన్నాము అంటే.. అది ఆయన సలవే. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18 వేలు అందేవి, రుణమాఫీ జరిగింది. అదేవిధంగా మా వారికి పింఛన్ అందుతుంది. జగన్ నవరత్నాలు ప్రవేశపెట్టి పేదల పాలిట పెన్నిధిగా నిలిచారు.

– వీ నాగరత్నం, లోకమూడి, మండవల్లి మండలం

జగనన్న మా కల నిజం చేశారు



కొన్నేళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఇన్నేళ్లకు జగనన్న సొంత ఇంటి కలను నిజం చేశారు. పల్లెవాడలో పట్టా అందుకోనుండడం ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. నాకు చేయూత ద్వారా రూ.18 వేలు లబ్ధి పొందాను. అలాగే మా మామయ్యకు పింఛన్ కూడా ప్రతి నెలా ఉదయాన్నే వలంటీర్ రూ.3 వేలు అందించేవారు. నా బిడ్డకు అమ్మ ఒడి అందింది. నాకు డ్వాక్రాలో రుణమాఫీ కూడా జరిగింది. మాలాంటి పేదలకు దేవుడిచ్చిన వరం జగన్. మా జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం.

– జీ శాంతి, పల్లెవాడ, కైకలూరు మండలం

జగనన్నకే మా మద్దతు



ముఖ్యమంత్రి జగనన్న హయాంలో నా కుటుంబం ఎన్నో ప్రయోజనాలు పొందింది. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న నాకు ఏటా రూ.10 వేలతో పాటు నా తల్లికి పింఛన్, నా కుమారుడికి అమ్మ ఒడి, నా భార్యకి రుణమాఫీ జరగడంతో ఆర్థిక ప్రయోజనాలు పొందాము. దీనితో జీవితాంతం కుటుంబమంతా జగనన్నకు మద్దతు పలుకుతాం.

– కూకటి కిరణ్, తక్కెళ్ళపాడు, మండవల్లి మండలం

జగన్ రుణం తీర్చుకుంటాం



ప్రతి నెలా ఒకటో తేదీనే తెల్లవారుజామున వృద్ధాప్య పింఛన్ వలంటీర్లు ఇంటికి తీసుకువచ్చి అందించారు. నాలాంటి వృద్ధుల పాలిట జగనన్న దేవుడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. రేపటి ఎన్నికల్లో నాలాంటి వృద్ధులంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రుణం తీర్చుకుంటాం.

– ఎస్ సీతారావమ్మ, గోపవరం, కైకలూరు మండలం

అణగారిన వర్గాలకూ సామాజిక భద్రత



మాలాంటి అణగారిన వర్గాల కోసం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. జగనన్న హయాంలోనే మాలాంటి వారికి ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత ఏర్పడింది. రేపటి ఎన్నికల్లో జగన్‌కు భారీ విజయాన్ని చేకూర్చేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం.

– ఇజ్జేటి గణేష్, కాకరవాడ, ముదినేపల్లి మండలం

బాబు మాటలు నమ్మం



ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున మా బిడ్డ జగనన్న క్రమం తప్పకుండా ఇంటివద్దే పింఛను అందిస్తున్నాడు. చంద్రబాబు నెలకు రూ.4 వేలు పింఛను ఇస్తానని చెబుతున్నవి మాయమాటలు. వాటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మేది లేదు. రేపటి ఎన్నికల్లో నాలాంటి వృద్ధులంతా జగన్‌బాబుకే అండగా నిలబడతాం.

– బొడ్డు బాయమ్మ, గోపవరం, కైకలూరు మండలం

జగనన్న రుణం తీర్చుకుంటాం



ముఖ్యమంత్రి జగనన్న వల్ల నాకుటుంబానికి ఎంతో మేలు జరిగింది. ఆటో డ్రైవర్‌గా ఉన్న నా భర్తకు ప్రతి ఏటా రూ.10 వేలతో పాటు నాకు డ్వాక్రా రుణం మాఫీ అయ్యింది. మా అబ్బాయికి అమ్మ ఒడి పథకం వర్తించింది. ఇన్ని రకాలుగా ఆదుకుంటున్న జగనన్నకు తప్ప మరెవరికీ ఓటు వేసేదిలేదు.

– బెండా కీర్తన, పల్లెవాడ, కైకలూరు మండలం



గడ్డపల్లి నుంచి బైక్ అంబులెన్స్‌లో పేషెంట్‌ను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

- ఏజెన్సీలో సేవలందిస్తున్న బైక్ అంబులెన్స్‌లు
- గిరిజనులకు తీరిన డోలీ మోతల కష్టాలు
- మారుమూల కొండ ప్రాంత గ్రామాలకూ ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు
- అత్యవసర పరిస్థితుల్లో రోగులను బైక్ అంబులెన్స్‌లో పీహెచ్‌సీలకు తరలింపు

కొండ గూటికి.. కుయ్.. కుయ్.. కుయ్..



ముంజులూరులో రోగిని బైక్ అంబులెన్స్ ఎక్కించిన వైద్య సిబ్బంది (ఫైల్)



గోగుమిల్లిలో పేషెంట్‌ను అంబులెన్స్‌లో కూర్చోబెడుతున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల కొండప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు బైక్ అంబులెన్స్‌లు భరోసా కల్పిస్తున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కుటుంబాలకు జీవం పోస్తూ అండగా నిలుస్తున్నాయి. 108, 104 వాహనాలు వెళ్లలేని అటవీప్రాంతాల్లో సైతం సులభంగా చేరుకుంటూ ఆయా గ్రామాల్లోని గిరిపుత్రులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చొరవతో మారుమూల గ్రామాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందడంతో డోలీమోత కష్టాలు తీరాయి. ఏజెన్సీ ప్రాంతంలోని ఐటీడీఏ పరిధిలో 8 బైక్ అంబులెన్స్‌లు సేవలందిస్తున్నాయి. ఈ వాహనాలను నడపడం, వైద్య సేవలు అందించేందుకు మెడికల్ టెక్నీషియన్లను సుమారు 16 మందిని నియమించారు. వీరి ద్వారా మారుమూల గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నారు.

40 గ్రామాలకు పైగా బైక్ అంబులెన్స్‌ల ద్వారా సేవలు

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల పరిధిలో 152 గ్రామాలు, 405 శివారు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 15 పీహెచ్‌సీలు, 86 సబ్‌సెంటర్లతోపాటు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 80 విలేజ్ క్లినిక్‌లు, అలాగే రెండు సామాజిక ఆరోగ్యకేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. వీటిలో 40 మంది వైద్యులు, సుమారు 260 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. గిరిజన మండలాల్లో సుమారు 1,20,000 వరకూ గిరిజన జనాభా ఉంది. ఇక్కడ 5 గిరిజన మండలాల్లోని 1,89,219 విస్తీర్ణంలో కొండ గ్రామాలు విస్తరించి ఉన్నాయి. వీటిలో బస్సులు, 108, 104 వాహనాలు తిరగని గ్రామాలు అనేకం ఉన్నాయి. ఆయా గ్రామాల్లో గిరిజనులు అనారోగ్యాలపాలైతే వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో రోగులను డోలీ కట్టి భుజాలమీద మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకువెళ్తారు. ఆయా గ్రామాలను గుర్తించిన అధికారులు బైక్ అంబులెన్స్ ద్వారా గిరిజనుల కష్టాలు తీర్చారు.



గతంలో వైద్యం కోసం డోలీలో రోగిని మోసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

గడచిన ఐదేళ్లలో అందించిన సేవలు

గడచిన ఐదేళ్లలో బైక్ అంబులెన్స్ ద్వారా అనేక మందికి సేవలందించడం జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. 2019వ సంవత్సరంలో సుమారు 6,006 మందికి, 2020లో 5,458 మందికి, 2021లో 6,093 మందికి, 2022లో 6,500 మందికి, 2023లో 7,853 మందికి, 2024లో ఇప్పటి వరకూ 2,601 మందికి సేవలందించినట్లు అధికారులు చెబుతున్నారు.

డోలీ కష్టాలు తప్పాయి



"గతంలో మారుమూల గ్రామాల్లో అనారోగ్యం పాలైన వారిని డోలీ కట్టి మోసుకుంటూ వైద్యం కోసం తీసుకువెళ్లేవాళ్లం. అయితే మొబైల్ బైక్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేయడం వల్ల మాకు ఆ కష్టాలు తీరాయి. అందుబాటులోనే వాహనం ఉంచడంతోపాటు అనుభవజ్ఞులైన టెక్నీషియన్‌లను ఏర్పాటు చేశారు. సకాలంలోనే మాకు సేవలందిస్తున్నారు.

– మడకం రమేష్, అలివేరు, బుట్టాయగూడెం మండలం

బైక్ అంబులెన్స్.. చాలా ఉపయోగకరం



కొండల మీద అటవీ ప్రాంతంలో 108, 104 వాహనాలు తిరగని పరిస్థితి. గర్భిణులను, అనారోగ్యంతో ఉన్న వారిని ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొట్టెలో బైక్ అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇది చాలా ఉపయోగకరంగా ఉంది. బైక్ అంబులెన్స్ ఏర్పాటుతో మాకు బాధలు తీరాయి.

– కారం వాసు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



జగనన్న ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో వైద్య రంగానికి పెద్దపీట వేసింది. 108, 104 వాహన సేవలను విస్తృతం చేయడంతోపాటు ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అమలు జరిగేలా కృషి చేస్తున్నారు. అలాగే బైక్ అంబులెన్స్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈ ప్రాంతంలో సుమారు రూ.50 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యం.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం



ఏలూరులో ప్రగతి జాడలు

పోణంగి కాజ్‌వే ప్రాంతంలో వంతెన నిర్మాణం

- రూ.80 కోట్లతో తమ్మిలేరు రిటైనింగ్ వాల్
- రూ.150 కోట్లతో రోడ్లు, అభివృద్ధి పనులు
- రూ.361 కోట్లతో అమృత్ 2.0 పనులు
- రూ.447 కోట్లతో సంక్షేమ ఫలాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. సీఎం జగన్ పాలనలో ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి పరుగులు తీయించారు. నగరంలో సుమారు 70 వేల కుటుంబాలు సంక్షేమ పథకాలు అందుకున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికీ చేదోడుగా నిలిచారు.

మౌలిక వసతులకు పెద్దపీట

నగరంలోని 79 సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున గడపగడపకు మన ప్రభుత్వం నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. సుమారు రూ.31.60 కోట్లతో పనులు చేయించారు. నగరంలో జీజీపీఎం, జనరల్ ఫండ్ రూ.44 కోట్లతో పాటు ఎస్ఆర్ఈజీఎస్ రూ.23 కోట్లు, ఆర్అండ్‌బీ నిధులు రూ.2.50 కోట్లు, ఇడా నిధులు రూ.2.50 కోట్లు, కార్పొరేషన్, ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.60 కోట్ల మేర అభివృద్ధి పనులకు వెచ్చించారు. మొత్తంగా రూ.150 కోట్ల నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు. అలాగే మౌలిక వసతుల కల్పనలో భాగంగా 795 అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, బోర్లు, పైపులైన్లు) చేపట్టారు. నగరంలో రూ.33.19 కోట్లతో 36 ప్రధాన రహదారుల్లో రోడ్లను విస్తరించడం, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి నగరాన్ని సుందరీకరించారు.

అమృత్ 2.0 నిధులు

ఏలూరు వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, 7 విలీన గ్రామాలకు గోదావరి జలాలను ఇంటింటికీ సరఫరా నిమిత్తం అమృత్ 2.0 పథకంలో నియోజకవర్గానికి రూ.361.55 కోట్లు మంజూరు చేశారు. నగరంలో 14 నూతన సచివాలయ భవనాలను నిర్మించారు. 8 రైతుభరోసా కేంద్రాలు, 5 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, 5 యూపీహెచ్‌సీలను ప్రారంభించారు.

రూ.80 కోట్లతో తమ్మిలేరు రిటైనింగ్ వాల్

నగరానికి దుఃఖదాయినిగా మారిన తమ్మిలేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ సీఎం జగన్ రూ.80 కోట్ల నిధులను మంజూరు చేశారు. వీటితో 6.50 కిలోమీటర్ల మేర తమ్మిలేరు ఏటిగట్టుకు రిటైనింగ్‌వాల్ నిర్మించారు. ముఖ్యంగా పోణంగి ప్రాంతంలో రెండు వైపులా రివిట్‌మెంట్ నిర్మించడంతో పాటు కాజ్‌వే ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టారు.



పోణంగి వద్ద తమ్మిలేరు రిటైనింగ్‌వాల్



గ్రామ సచివాలయం



ఏలూరు సర్వజన ఆస్పత్రి

1.87 లక్షల మందికి సంక్షేమం

నగరంలో సుమారు 96 వేల గృహాలుండగా 70 వేల కుటుంబాలకు నేరుగా సంక్షేమ పథకాలు అందాయి. డీబీటీ రూపంలో రూ.447 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. వీటిలో అగ్రభాగం అక్కచెల్లెమ్మలకు రూ.400 కోట్లు అందించినట్టు రికార్డులు చెబుతున్నాయి. మొత్తంగా 1.87 లక్షల మంది సంక్షేమ పథకాలు అందుకున్నారు.